క్లుప్తంగా

మూడో సోమవారానికి సిద్ధమైన శివాలయాలు


విద్యుత్ అలంకరణలో రాజాంలోని మల్లికార్జునస్వామి ఆలయం

రాజాం: పరమ పవిత్రమైన కార్తీకమాస మూడో సోమవారం పూజలకు పట్టణంలోని కూరాకుల వీధిలోని రామలింగేశ్వర శివాలయం, మల్లికార్జునస్వామి ఆలయం, గురవాం, పొగిరి, కంచరాం, పొనుగుటివలస ప్రాంతాల్లో శివాలయంలు సిద్ధమయ్యాయి. ఆలయాలను విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం


రాజాంలో ర్యాలీ చేస్తున్న మెప్మా ఉద్యోగులు, విభిన్నప్రతిభావంతులు

రాజాం: విభిన్న ప్రతిభావంతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తోందని మెప్మా టీఎంసీ ఎస్పీ రత్నం అన్నారు. చిన్న చిన్న వ్యాపారాలు, పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ, విభిన్న ప్రతిభావంతులకు మహిళా సంఘాల ద్వారా ఇస్తున్న సున్నా వడ్డీ రుణాల వివరాలను వెల్లడించారు. విభిన్న ప్రతిభావంతుల సహాయక సంఘాలు ఉన్నాయని, వాటిలో చేరాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా సీఓలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి


విద్యార్థినితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదువంటే మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, కథలు చదివించడం, చెప్పించడం చేయించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవచ్చని, అనేకానేక విషయాలు తెలుస్తాయన్నారు.

రేషన్ పంపిణీ పరిశీలన


రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొబ్బిలి: రేషన్ సరుకులను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వాహనాల ద్వారా చేపడుతున్న రేషన్ పంపిణీని ఆయన ఆదివారం పరిశీలించారు. లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా ఎవరైనా అవకతవకలకు పాల్పడినట్లు సమాచారం వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

మహిళల్లో చైతన్యం రావాలి

రేగిడి: మహిళల్లో చైతన్యం రావాలని ఏపీఎం పి.గోవిందరావు ఆకాంక్షించారు. ఈ మేరకు మండలంలో అన్ని గ్రామాల్లో స్వయంశక్తి సంఘాల సభ్యులతో లింగ ఆధారిత వివక్ష వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. చిన్నశిర్లాంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

రక్తదానం గొప్పది..

విజయనగరం ఫోర్ట్: అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని 43వ వార్డు కార్పొరేటర్ సత్య వతి అన్నారు. నావికా దళ ఆవిర్భావ దినోత్స వం సందర్భంగా ఆదివారం స్థానిక న్యూలైఫ్ బ్లడ్ సెంటర్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరా న్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రక్తదానం సామాజిక బాధ్యత గా గుర్తించాలన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు బి.రామకృష్ణారావు 179 వ సారి రక్తదానం చేశారు. కార్యక్రమంలో రమణ, శివశంకర్, అబ్దుల్ రవూఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ



రామభద్రపురం: ఓటు నమోదు దరఖాస్తులు పరిశీలిస్తున్న తహసీల్దార్ సులోచనరాణి


బాడంగి: కోడూరులో దరఖాస్తుల పరిశీలనలో ఆర్‌డీవో సాయిశ్రీ


తెర్లాం: వెలగవలసలో ప్రత్యేక ఓటర్ల నమోదుపై ఆరాతీస్తున్న తహసీల్దార్ రత్నకుమార్


తెర్లాం: ఎం.ఆర్.అగ్రహారంలో ఓటర్ల నమోదు వివరాలు పరిశీలిస్తున్న బొబ్బిలి ఆర్‌డీవో సాయిశ్రీ


రాజాం: అంతకాపల్లిలో స్పెషల్ క్యాంపైన్ పరిశీలిస్తున్న ఆర్ఓ సుధారాణి, తదితరులు

కచ్చితమైన ఓటరు జాబితాయే లక్ష్యంగా రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు ఆదివారంతో ముగిసింది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయడంతో పాటు కొత్తగా అభ్యర్థుల నుంచి ఓటు దరఖాస్తులు స్వీకరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా ముసాయిదా ఆధారంగా శాశ్వతంగా వలస వెళ్లిన, మృతుల ఓట్లను తొలగించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ఓ వజ్రాయుధమని, 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్ల వయసు నిండిన యువతీయువకులంతా తప్పనిసరిగా ఓటుహక్కు పొందాలని అధికారులు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్


వంగర: లక్ష్మీపేటలో ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ డి.ఐజాక్


రేగిడి: సంకిలి పోలింగ్ కేంద్రం వద్ద వివరాలు సేకరిస్తున్న జేఈ మయూర్ అశోక్


రేగిడి : వన్నలి బీఎల్‌ఓ కేంద్రం వద్ద ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమంలో బీఎల్‌ఓ భారతి, తదితరులు

చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి

- ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: చివరి గింజ వరకు ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందని, దళారుల బారినపడి రైతులు మోసపోవద్దని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని పిరిడి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ, ఎమ్మెల్యే కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం వారు తేమశాతం లెక్కించే పరికరాలు, కొనుగోలు యంత్రాలు పరిశీలించి, అవి పనిచేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే రైతులు నష్టపోకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని సూచించారు. సాధారణ వరి రకం క్వింటా రూ.2183కు, గ్రేడ్–ఏ రకం క్వింటా రూ.2203కు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన వారం రోజుల్లోగా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలన్నారు. మిచాంగ్ తుపాను నేపథ్యంలో అధికారులు, రైతులు అప్రమత్తం కావాలని, పంట నష్టం జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, సర్పంచ్ తుట్ట వరలక్ష్మి, పౌరసరఫరాల ఉప తహసీల్దార్ రెడ్డి సాయికృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి


మండల కేంద్రంలోని పంట పొలాల్లో రైతులకు సూచనలిస్తున్న ఏవో వెంకటయ్య

రామభద్రపురం: మిచాంగ్ తుపాను నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో వెంకటయ్య సూచించారు. మండలంలోని రామభద్రపురం, కొండకెంగువ, తారాపురం గ్రామాలను ఆదివారం సందర్శించిన ఆయన అక్కడి వ్యవసాయ పొలాలకు వెళ్లి, తుపాను కారణంగా రైతులు నష్టపోకుండా ఉండేందుకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు తుపాను ప్రభావం ఉంటుందని, భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. నూర్పిడి చేసిన పంటను సమీపంలోని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. అలాగే కోసిన వరి ఫనలను చిన్నచిన్న గాలి దిబ్బలుగా వేసుకోవాలని, దిబ్బలు చుట్టూ వర్షపునీరు నిల్వ ఉండకుండా బట్టీలు తీసుకోవాలన్నారు. కోసిన వరి పంట ఫనలను దిబ్బలు వేయకపోతే ఫనలపై ఉప్పు ద్రావణం పిచికారీ చేయడం గానీ ఉప్పును చల్లడం గానీ చేయాలన్నారు. ఇలా అయితే వర్షానికి తడిచినా గింజ రంగుమారదని, నాణ్యంగానే ఉంటాయన్నారు. పత్తి ఏరేందుకు సిద్ధంగా ఉంటే వర్షం పడకముందే ఏరుకుంటే మంచిదన్నారు. కార్యక్రమంలో వీఏఏలు అప్పలనాయుడు, శర్మ తదితరులు పాల్గొన్నారు.

వరి కుప్పలు భద్రపరుచుకోవాలి..


మెంటాడ: పొలాల్లో వేసిన వరికుప్పలు

వంగర: తుఫాన్ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ తట్టికోట కన్నబాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే కోతలు పూర్తి చేసిన రైతులు కుప్పలుగా వేసుకుని భద్రపరుచుకోవాలన్నారు. అవసరమైతే టార్పాలిన్లు కప్పాలని సూచించారు.

మెంటాడ: మిచాంగ్ తుపాను నేపథ్యంలో రైతులు అప్రమత్తమయ్యారు. ఏ క్షణాన వర్షం వస్తుందోనన్న భయంతో కోసిన వరి పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించి, భద్రపరుస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో నష్టపోతే ఎలా అని, దైవమే కాపాడాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

సమన్వయంతో పనిచేయాలి


ఆరోగ్యశాఖపై సమీక్షిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- ఎంపీ బెల్లాన, శాసనమండలి విప్ విక్రాంత్, ఎమ్మెల్యే జోగులు

రేగిడి: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలనిఎంపీ బెల్లాన, శాసనమండలి విప్ విక్రాంత్, ఎమ్మెల్యే జోగులు అధికారులకు సూచించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రజా ప్రతినిధులు ప్రజలకు వివరించాలన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు పలు శాఖల అభివృద్ధి, ఇటీవల నిర్వహించిన కార్యక్రమాలపై ఆరా తీశారు. అనంతరం ఆరోగ్యశాఖపై జరిగిన చర్చలో ఇటీవల జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంచి ఫలితాన్ని ఇచ్చిందని వెల్లడించారు. మెరుగైన వైద్యం, ఆపరేషన్లు నిమిత్తం పెద్దాస్పత్రిలకు తరలించిన రోగులపై దృష్టి సారించాలని వైద్యాధికారి సోహిణీరాఘవ్‌కు సూచించారు. ఉపాధిహామీపై జరిగిన సమీక్షలో మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు. 11 పంచాయతీల్లో పనులు ప్రారంభించినట్లు ఏపీఓ ఎస్.హరనాథరావు తెలిపారు. విద్యపై ఎంఈఓ బి.ఎరకయ్య, తాగునీటిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్, వ్యవసాయశాఖపై వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ, పంచాయతీరాజ్‌పై ఏఈ రామకృష్ణ, రెవెన్యూపై తహసీల్దార్ సుదర్శనరావు, మహిళా సంఘాల అభివృద్ధిపై ఏపీఎం వై. గోవిందరావు మాట్లాడుతూ, తమ శాఖల ద్వారా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ శ్యామల కుమారి, తహసీల్దార్ సుదర్శనరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత


ఎంపీ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హేమలత

బాడంగి: చీపురుపల్లిలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను ఏఐజీడీఎస్ యూనియన్ ప్రత్యేక ఆహ్వానితురాలు, పాల్తేరు బీపీఎం ఆర్.హేమలత ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె గ్రామీణ డాక్ సేవక్‌ల సమస్యలను ఎంపీకి వివరించారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేవడుతున్నామని తెలిపారు. స్పందించిన ఎంపీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక పట్టణంలో నిరుపేదలకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా దుప్పట్లు పంపిణీ ఆదివారం చేపట్టారు. విశ్వనాథ గురుస్వామి వర్ధంతి సందర్భంగా ఆయన శిష్యులు ఈ సేవా కార్యక్రమం చేపట్టడం గమనార్హం. కార్యక్రమంలో కాజా గోపాలరావు, పాలూరి శంకరరావు, కింతలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

బొబ్బిలి: మండలంలోని జగన్నాథపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించింది. సాయంత్రం 4 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలు, అధికారులంతా హాజరుకావాలని కోరారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు


కోనంగిపాడులో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వంగర: మండల పరిధి కోనంగిపాడులో తాగునీటి బోర్లకు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. సర్పంచ్ చందక తాతబాబు ఆధ్వర్యంలో బోర్‌మెకానిక్ కళింగ కృపారావు ప్రధాన వీధుల్లోని పాడైన బోర్లను బాగు చేశారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

సందడిగా వనభోజనాలు


గెడ్డవలస తోటలో వనభోజన కార్యక్రమాల్లో భాగంగా పూజల్లో ఎమ్మెల్యే జోగులు, తదితరులు

రాజాం: పట్టణ పరిధిలోని పాలకొండ, చీపురుపల్లి రోడ్డులలో పలు సంఘాలు, సంస్థలు, పాఠశాలలు ఆదివారం వనభోజన కార్యక్రమాలు నిర్వహించాయి. మండలంలోని గెడ్డవలసలో బూరాడ చండీరాంప్రసాద్, ముదిలి జనార్దనరావులతో పాటు అయ్యప్ప భక్తులు లక్ష్మీయూత్ ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించి సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే మరికొంతమంది వనభోజనాలు ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాలన్నీ సందడిగా మారాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులుతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వంగర మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం


నందబలగలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

రాజాం సిటీ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అధికారులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. మండల పరిధి నందబలగలో వికసిత భారత సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. గ్యాస్ కనెక్షన్లు, ఉపాధి హామీ పథకం, హౌసింగ్ స్కీమ్‌లపై ఎంపీడీఓ బాసూరి శంకరరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి.. ప్లీజ్..


జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద భయంతో ఇద్దరేసి జట్టు పట్టుకుని మరీ రోడ్డు దాటుతున్న విద్యార్థులు

రామభద్రపురం: మండల కేంద్రం అంతర్ రాష్ట్ర కూడలి కావడంతో రోజురోజుకూ వాహనాల రద్దీ పెరిగిపోతోంది. దీంతో పాఠశాలల వద్ద రోడ్డు దాటేందుకు విద్యార్థులు తీవ్రంగా భయపడుతున్నారు. రోడ్డుపై ఏ విధమైన వేగ నియంత్రణ సూచికలు లేకపోవడంతో వాహన చోదకులు తగ్గేదేలే అంటూ అతి వేగంగా వాహనాలు నడుపుతున్నారు. పాఠశాలకు వచ్చినపుడు, పాఠశాల విడిచిపెట్టిన తర్వాత విద్యార్థులు రోడ్డు దాటాలంటే ఇద్దరు లేక ముగ్గురు జట్టు పట్టుకుని మరీ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఎప్పుడు ఏ వాహనం స్పీడ్‌గా వస్తుందో లేదో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని, పాఠశాలల వద్ద తప్పనిసరిగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కలసికట్టుగా ఉంటేనే అభివృద్ధి..

రాజాం సిటీ: అంతా కలసికట్టుగా ఉంటేనే కుల సంఘాభివృద్ధి సాధ్యమవుతుందని తెలగ కుల సంక్షేమ సంఘ పెద్దలు డి.శ్రీనివాసరావు, తోట తిరుమలరావు అన్నారు. ఆదివారం స్థానిక బొబ్బిలి రోడ్డులోని ఫైర్‌స్టేషన్ వెనుక భాగంలోని తోటలో రాజాం మండల తెలగ కుల సంక్షేమ సంఘం పిక్నిక్ నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంఘంలోని వెనుకబడిన కుటుంబాలను ఆదుకునేందుకు తోడ్పాటునందించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు మానం గోవిందరావు, బీవీ అచ్యుత్‌కుమార్, అద్దంకి గోపి, గర్లంకి శ్రీనివాసరావు, అద్దంకి మధు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి క్షీరాభిషేకం


అయ్యప్పస్వామి తిరువీధిలో పాల్గొన్న భక్తులు

రాజాం సిటీ: నగరంలోని విశ్వనాథ గురు నిలయంలో అయ్యప్పస్వామికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. శాస్తా సమాజం పీఠాధిపతి ఉమాపతి శేషు గురుస్వామి ఆధ్వర్యంలో వేకువజాము నుంచే పూజలు నిర్వహించారు. అలాగే 500 లీటర్ల పాలతో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. అనంతరం పురవీధుల్లో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని తిరువీధి నిర్వహించారు.